26 నుంచి రైతుబంధు

మూడోపేజీ తరువాయి...

చర్యలు తదితర అంశాలపై మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ అధికారులతో సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. తెలంగాణ వ్యవసాయాన్ని, రైతాంగాన్ని కాపాడుకోవడమే తమ ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని పునరుద్ఘాటించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంట సాగుకు అంతరాయం లేకుండా సాగునీటి సరఫరా కోసం ముందస్తు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖను ఆదేశించారు. ఇందుకోసం ఎంత ఖర్చయినా ఫర్వాలేదని స్పష్టం చేశారు. 'పైసలు పోయినా ఫర్వా లేదు, పంటలను కాపాడాలి' అని అధికారులను ఆదేశించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనుల పురోగతిని సమీక్షించారు.

తాగు, సాగునీటికి ఇబ్బంది రావొద్దు

జూలై మొదటి వారం దాకా వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉంటాయన్న హెచ్చరికల నేపథ్యంలో తాగునీటి కోసం ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించారు. వర్షాభావ పరిస్థితుల రోజుల్లో సాగు నీటి విడుదలకు కొద్దిరోజులు విరామం ఇవ్వాలని సూచించారు. జలాశయాల్లో ప్రస్తుత నీటి నిల్వలు, మిషన్ భగీరథ అవసరాలపై అధికారులను ఆరా తీశారు. కాళేశ్వరం పరిధిలోని రిజర్వాయర్లలో నీటి నిల్వ వివరాలను అడిగి తెలుసుకొన్నారు. ప్రస్తుతం రంగనాయకసాగర్ జలాశయంలో మూడు టీఎంసీల సీలకుగాను 0.69 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉన్నదని ఇంజినీర్లు తెలుపగా, రంగనాయకసాగర్‌కు రెండు టీఎంసీల నీటిని మిడ్ మానేరు జలాశయం నుంచి తక్షణమే ఎత్తిపోయాలని అధికారులను ఆదేశించారు. తద్వారా రంగనాయకసాగర్ జలాశయం కింద ఆయకట్టుకు వానకాలం పంటకు నీరందించేందుకు వీలవుతుందని తెలిపారు. ప్రస్తుతం నిజాంసాగర్ జలాశయంలో ఉన్న 4.95 టీఎంసీల నీటి నిల్వలు ఆగస్టు చివరి వరకు 3 తడులకు సరిపోతాయని, ఆ తర్వాత మరో మూడు తడులకు 5 టీఎంసీలు అవసరమని ఇంజినీర్లు సూచించారు. దీనికోసం ఆగస్టులో 5 టీఎంసీలను కొండపోచమ్మ సాగర్ ద్వారా నిజాం సాగర్‌కు తరలించాలని సమావేశం నిర్ణయించింది. ఆగస్టులోనే శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వలను సమీక్షించుకొని, కొరత ఏర్పడిన పక్షంలో శ్రీరాంసాగర్ పునరుజ్జీవన పథకం ద్వారా 30 నుంచి 35 టీఎంసీల నీళ్లను కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోయాలని నిర్ణయించారు.

72 వేల కోట్లకు చేరనున్న సాయం

రాష్ట్ర, దేశ వ్యవసాయరంగంలో రైతుబంధు విప్లవాత్మకమైన పథకం. రైతుకు పెట్టుబడి భారాన్ని తప్పించాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ 2018లో శ్రీకారం చుట్టిన ఈ పథకం నిర్విఘ్నంగా కొనసాగుతున్నది. ఈ పథకం కోసం ప్రభుత్వం ప్రతియేటా రూ.15వేల కోట్ల వరకు వెచ్చిస్తున్నది. 2018 నుంచి గత సీజన్ వరకు 10 సీజన్లలో రైతుల ఖాతాల్లో రూ.65,192 కోట్ల భారీ మొత్తాన్ని జమ చేసింది. ఒక పథకం ద్వారా ఇంత భారీ మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసిన ఏకైక ప్రభుత్వం దేశం మొత్తంలో ఒక్క తెలంగాణ మాత్రమే. ప్రస్తుత వానకాలం సీజన్‌తో కలిపితే రైతుబంధు పంపిణీ సాయం రూ.72 వేల కోట్లకు చేరనున్నది.

'పాలమూరు-రంగారెడ్డి'పై సమీక్ష

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోత పనుల పురోగతిపై సీఎం కేసీఆర్ సమీక్షించారు. సుప్రీంకోర్టు తీర్పునకు లోబడి ఆగస్టు చివరి నాటికి తాగునీటి కోసం నార్లాపూర్, ఏదుల, కరివెన, ఉద్దండాపూర్ జలాశయాల్లోకి నీటిని ఎత్తిపోయాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి అవసరాలకు నీటిని మిడ్ మానేరు నుంచి గౌరవెల్లి జలాశయంలోకి కూడా ఎత్తిపోయాలని సూచించారు. గౌరవెల్లి ఆయకట్టుకు సాగునీటి సరఫరా కోసం కాల్వల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వార్ధా బరాజ్ ప్రాజెక్టు పరిపాలన అనుమతి కోసం రూ.4,252.53 కోట్లకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించామని ఈఎన్సీ మురళీధర్ తెలిపారు. కేంద్ర జల సంఘంలో వార్ధా బరాజ్ ప్రాజెక్టు డీపీఆర్ పరిశీలన ప్రారంభమైనందున త్వరలో ప్రాజెక్టుకు పరిపాలన అనుమతి మంజూరు చేయాలని ఈఎన్సీ కోరారు. ప్రాజెక్టుకు పరిపాలన అనుమతి ప్రక్రియను పూర్తి చేసి ప్రభుత్వ ఆమోదం కోసం పంపాలని సీఎం సూచించారు. సమావేశంలో మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, సీఎస్ శాంతికుమారి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, సీఎం ముఖ్య సలహాదారు సోమేశ్‌కుమార్, ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, సీఎం సెక్రటరీలు స్మితా సభర్వాల్, భూపాల్‌రెడ్డి, సీఎం ఓఎస్డీలు శ్రీధర్‌రావు దేశ్‌పాండే, ఎత్తిపోతల సలహాదారు పెంటారెడ్డి, ఈఎన్సీలు మురళీధర్, ఎన్ వెంకటేశ్వర్లు, శంకర్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు

రైతు బంధు పంపిణీకి ఆమోదం తెలిపిన సీఎం కేసీఆర్‌కు రాష్ట్ర రైతాంగం పక్షాన కృతజ్ఞతలు. దేశంలో రైతుల మేలు కోసం ఆలోచిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమే. అందుకే సీజన్ మొదలైందంటే చాలు రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నారు. రైతులు అడగకముందే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నారు.

- పల్లా రాజేశ్వర్‌రెడ్డి,
ఎమ్మెల్సీ, రైతుబంధు సమితి అధ్యక్షుడు

విడతలవారీగా రైతుబంధు పంపిణీ వివరాలు

సంవత్సరం	సీజన్	రైతుల సంఖ్య (లక్షల్లో)	పంపిణీ మొత్తం (కోట్లలో)	విస్తీర్ణం (లక్షల ఎకరాలు)
2018-19	వానకాలం	50.25	5,236.29	130.91
	యాసంగి	49.13	5,251.83	131.30
2019-20	వానకాలం	51.61	6,125.54	122.51
	యాసంగి	42.42	4,406.48	88.13
2020-21	వానకాలం	57.90	7,279.02	145.58
	యాసంగి	59.32	7,367.32	147.35
2021-22	వానకాలం	60.84	7,360.41	147.21
	యాసంగి	63.00	7,411.52	148.23
2022-23	వానకాలం	64.99	7,433.13	148.66
	యాసంగి	65.00	7,311.08	146.22
మొత్తం	—	—	65,192.30	—

66 లక్షల మంది.. రూ.7,500 కోట్ల నిధులు

'రైతు బంధు' పంపిణీ చేయాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాల నేపథ్యంలో వ్యవసాయ శాఖ చర్యలను ప్రారంభించింది. కొత్త రైతుల వివరాలను సేకరించే పనిలో పడింది. సోమవారం (19వ తేదీ) వరకు జరిగిన రిజిస్ట్రేషన్లకు సంబంధించిన రైతుల వివరాలను తీసుకోనున్నది. నేడో రేపో సీసీఎల్‌ఏ నుంచి రైతుల జాబితా వ్యవసాయ శాఖకు అందనున్నది. దీని ఆధారంగానే పెట్టుబడి పంపిణీ చేయనున్నది. ఇక ఈ సీజన్‌లో సుమారు 66 లక్షల మంది రైతులు రైతు బంధుకు అర్హులుగా ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ సీజన్‌లో పెట్టుబడి సాయం కోసం రూ.7,500 వరకు నిధులు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

లోకం పోకడ

ముందే చెప్పాచ్చు గదయ్య నువ్వు బీజేపీ అని.. అనవసరంగా ముడేళ్లు టైం వేస్టు.. ఆ టైంలో ప్రతి పక్ష పార్టీల మీద దాడులన్నా చేసేవాళ్లం గదా!

సిద్దిపేటలో శ్రీవారి ఆలయం

- **సీఎం కేసీఆర్ లేఖకు స్పందించిన ఏపీ సీఎం**
- **టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో నిర్ణయం**

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : సిద్దిపేటలో శ్రీవారి ఆలయం నిర్మించాలని టీటీడీ నిర్ణయించింది. సోమవారం తిరుమలలో జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నది. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. కరీంనగర్‌లో ఇటీవలే ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేసినట్టు చెప్పారు. సిద్దిపేటలో శ్రీవారి ఆలయం నిర్మించాలని, అందుకు ఆరు ఎకరాల స్థలం కేటాయిస్తామని ఏపీ సీఎం జగన్‌కు తెలంగాణ సీఎం కేసీఆర్ ఇటీవల లేఖ రాశారని చెప్పారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు సిద్దిపేటలో ఆలయం నిర్మించాలని మండలి నిర్ణయించిందని సుబ్బారెడ్డి తెలిపారు.

ఎండాకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	44.5°c	28.5°c
నల్లగొండ	42.0°c	24.4°c
కరీంనగర్	41.0°c	29.0°c
వరంగల్	41.0°c	28.0°c
మెదక్	40.9°c	26.0°c
రంగారెడ్డి	40.4°c	22.8°c
ఖమ్మం	40.0°c	29.0°c
నిజామాబాద్	39.8°c	29.5°c
మహబూబ్‌నగర్	39.6°c	25.1°c
హైదరాబాద్	37.8°c	28.6°c

అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమరవీరుల స్మారక చిహ్నం వద్ద 6 వేల మందితో నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో జూలూరు గౌరిశంకర్, దీపికారెడ్డి, శ్రీదేవి, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ హరికృష్ణ తదితరులు

22న అమరవీరుల స్మారక చిహ్నం ప్రారంభం

- **సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఆవిష్కరణ**
- **5వేల మంది కళాకారులతో ప్రదర్శన**
- **ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి వేముల**

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నాన్ని ఈ నెల 22న సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి స్మారక చిహ్నం ప్రారంభ ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా సీఎం కేసీఆర్ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి.. అక్కడి నుంచే అమరజ్యోతికి సెల్యూట్ చేస్తారని వివరించారు. అంబేద్కర్ విగ్రహ చౌరస్తా నుంచి అమరుల స్మారక చిహ్నం వరకు 6వేల మంది కళాకారులతో

ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. సాయంత్రం 800 డ్రోన్లతో అమరుల త్యాగాలు, తెలంగాణ ప్రగతిపై ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు. అమరుల త్యాగాలను స్మరిస్తూ 10వేల మందితో దీపాలు వెలిగించే ఏర్పాట్లు చేస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు.

ఆ అర్హత కాంగ్రెస్ నేతలకు లేదు

అమరుల స్మారక చిహ్నంపై విమర్శలు చేస్తున్న కాంగ్రెస్‌పై మంత్రి వేముల మండిపడ్డారు. అమరుల త్యాగాల గురించి మాట్లాడే నైతిక అర్హత కాంగ్రెస్ నేతలకు లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్.. ఢిల్లీలో స్వాతంత్ర్య అమరవీరుల స్మారకాన్ని ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. స్వాతంత్ర్య సమరయోధులను కాంగ్రెస్ విస్మరించిందని మండిపడ్డారు. పనికి మాలిన విమర్శలు చేసే రేవంత్ దీనికి సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. తెలంగాణ అమరవీరుల స్మారకం మనసుపెట్టి నిర్మించామని, అది కేసీఆర్ వల్లే సాధ్యమైందని తెలిపారు. ప్రతిపక్ష నేతలు అమరుల స్మారకాన్ని సందర్శించి వారికి నివాళులర్పించాలని మంత్రి సూచించారు.

సీమ నుంచి కదిలిన రుతుపవనాలు

- **మూడు రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో విస్తరణ**
- **మరో రెండు రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు**

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): ఎట్టకేలకు నైరుతి రుతుపవనాల్లో కదలిక వచ్చింది. రెండు వారాలుగా రాయలసీమలో తిష్ట వేసిన రుతుపవనాల్లో స్వల్ప కదలిక మొదలైంది. ఏపీలోని మరిన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించాయని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. రాగల రెండు, మూడు రోజుల్లో దక్షిణ భారతంలోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉన్నదని వివరించింది. తెలుగు రాష్ట్రాల్లో రుతుపవనాలు విస్తరించడానికి మరికొంత సమయం పడుతుందని వెల్లడించింది. రాష్ట్రంలో రాగల మూడు రోజులు అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ప్రధానంగా ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో అక్కడక్కడ వడగాడ్పులు వీచే అవకాశం ఉన్నదని హెచ్చరికలు జారీ చేసింది.

తెలంగాణలో తగ్గని ఎండలు

రుతుపవనాలు ఆలస్యమవుతుండటంతో తెలంగాణలో ఎండల తీవ్రత కొనసాగుతున్నది. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి ఉంటదని భారత వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం ఎండ తీవ్రత ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రెండు రోజులపాటు తీవ్ర వడగాడ్పులు వీస్తాయని హెచ్చరించింది. ఇంటి నుంచి బయటకు వెళ్తే తప్పనిసరిగా తలకు టవల్ లాంటి వస్త్రం చుట్టుకోవాలని, దాహం అనిపించకపోయినా నీళ్లు తాగాలని సూచించింది. మరోవైపు హైదరాబాద్ నగరంలోని పలు చోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదయ్యే అవకాశం ఉంది. సోమవారం పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలో 44.8 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు వాతావరణ శాఖ వెల్లడించింది.

కొండా.. ప్రజలే ఉరికించి కొడ్తారు

- **నోరు అదుపులో పెట్టుకోకుంటే ఊరుకోం**
- **అసభ్య వ్యాఖ్యలపై కేటీఆర్‌కు సారీ చెప్ప**
- **దమ్ముంటే నాపై పోటీ చేసి గెలవాలి**
- **ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సవాల్**

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): కొండా దంపతులు నోరు అదుపులో పెట్టుకోవాలని.. లేదంటే ప్రజలే వారిని ఉరికించి కొడతారని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హెచ్చరించారు. మాజీ మంత్రిగా, మాజీ ఎమ్మెల్సీగా వ్యవహరించిన కొండా సురేఖ, కొండా మురళి దంపతులు వాడుతున్న భాష దుర్మార్గంగా ఉన్నదని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ కాలిగోటికి కూడా కొండా మురళి సరిపోరని స్పష్టం చేశారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ కొండా దంపతుల తీరుపై ఫైర్ అయ్యారు. రాజకీయాల్లో విధానపరమైన విమర్శలు ఎవరైనా చేయవచ్చని, వ్యక్తిగత విమర్శలు చేయకూడదనే కనీస ఇంగితాన్ని, కొండా దంపతులు కోల్పోయారని దుయ్యబట్టారు.

కొండా దంపతులకు రాజకీయ పునర్జన్మను ఇచ్చిన సీఎం కేసీఆర్‌పై నోరుపారేసుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మంత్రిగా కొండా సురేఖ తెలంగాణ ప్రాంతానికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. గూండాగిరి చేసి రాజకీయ పబ్బం గడపటం మినహా వరంగల్ జిల్లాకు కొండా మురళి, సురేఖ ఏం చేశారని నిలదీశారు. మగతనం ఉండాలంటే మీసాలు ఉండాలా అని ఆయన ప్రశ్నించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌పై కొండా మురళి చేసిన వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే తెలంగాణ ప్రజలు ఉరికించి కొడతారని హెచ్చరించారు. కొండా దంపతులకు దమ్ముంటే పరకాలకు వచ్చి తనపై పోటీచేసి గెలవాలని సవాల్ విసిరారు. కొండా మురళి కంటే తమకు పదునైనా పల్లె భాష వచ్చని అయితే తమకు సంస్కారం అడ్డువచ్చి వాడటం లేదని చెప్పారు.

ప్రజల టీం బీఆర్ఎస్

బీఆర్ఎస్ ప్రజల టీం అని ఎమ్మెల్యే ధర్మారెడ్డి స్పష్టం చేశారు. దేశ ప్రజల జీవితాలు బాగుపడాలని సీఎం కేసీఆర్ తపిస్తున్నారని తెలిపారు. మహారాష్ట్రలో బీఆర్ఎస్ విస్తరిస్తున్న కారణంగానే అక్కడి రాజకీయ పార్టీల నేతల్లో కలవరం మొదలైందని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఎన్సీపీ నేత శరద్ పవార్ బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేశారని వెల్లడించారు. బీఆర్ఎస్ ఏ పార్టీకి బీ-టీంగా ఉండదని, ప్రజల టీంగా ఉంటుందని తెలిపారు.

రైస్‌మిల్లు

మూడోపేజీ తరువాయి...

ప్రకటించారు. ఈ నేపథ్యంలో సోమవారం వరిధాన్యాన్ని ప్రాసెసింగ్ చేసే జపాన్‌కు చెందిన సటేక్ కార్పొరేషన్ కంపెనీ ప్రతినిధులతో సచివాలయంలో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. 'వ్యవసాయాన్ని పండుగ చేయాలనే దార్శనికతతో సాగునీరు, విద్యుత్తు, రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి అంశాలను ప్రాధాన్య అంశాలుగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలను అమలుచేస్తూ ఉచిత విద్యుత్తును, సాగునీటిని అందిస్తూ, సబ్సిడీలిస్తూ రైతులను పంటలు పండించేందుకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నది. ఈ పరిస్థితుల్లో ఏ కారణంచేతనైనా పండిన పంట వ్యర్థం కాకుండా, తరుగు లేకుండా, రైతులకు ధర తగ్గడం వంటి నష్టాలు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. రైతు పంటకు ఓపెన్ మార్కెట్ ధర పలికేలా చేయడానికి వరిధాన్యాన్ని పలు రకాల ఉత్పత్తులుగా మార్చే దిశగా జిల్లాలవారీగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ప్రతి జిల్లాలో గంటకు 60 టన్నులు, 120 టన్నులు బియ్యాన్ని ఆడించే ఆధునిక సాంకేతికతో కూడిన రైస్ మిల్లులను ఏర్పాటు చేయనున్నాం' అని వెల్లడించారు. 'పంజాబ్ వంటి రాష్ట్రాలను వెనక్కి నెట్టి వరి ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ 3 కోట్లకు పైగా టన్నులకు చేరుకోవటం వెనుక ఎంతో కృషి దాగి ఉన్నది. మరికొద్ది రోజుల్లో పాలమూరు జిల్లాలోని పాలమూరు ఎత్తిపోతల, నల్లగొండ జిల్లా బ్రాహ్మణవెల్లెంల, డిండి, సిద్దిపేటలోని గౌరవెల్లి, ఖమ్మం జిల్లా సీతారామ, సిరిసిల్ల మల్కపేట, అచ్చంపేట ఉమామహేశ్వర వంటి ప్రాజెక్టులు పూర్తి కానున్నాయి. వరి ధాన్యం దిగుబడి మరింతగా పెరుగనున్నది. వరి ధాన్యపు మిల్లింగ్ సామర్థ్యాన్ని పెంచుకోవాల్సి ఉన్నది. ప్రస్తుతం రాష్ట్రంలో రైస్‌మిల్లుల సామర్థ్యం 75 లక్షల టన్నులకు మించి లేదు. ధాన్యాన్ని మిల్లాడించే పరిస్థితి డిమాండ్‌కు తగ్గట్టు లేకపోవడం వల్ల రైతులు ఇబ్బందిపడే పరిస్థితులు తలెత్తుతున్నాయి. వీటి నుంచి రైతును గట్టెక్కించడానికి ఈ నిర్ణయం తీసుకొన్నాం' అని చెప్పారు.

యూనిట్ల ఏర్పాటుకు రూ.2 వేల కోట్లు

తెలంగాణలో వరి ధాన్యం ఉత్పత్తి గణనీయంగా పెరిగి, దేశంలో నంబర్ వన్ స్థానానికి చేరుకున్నది. ఈ నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా, వారు పండించిన పంటకు లాభాలను ఆర్జించి పెట్టే మార్కెటింగ్ విధానాలను అమలు చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఇందుకోసం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు రూ.2 వేల కోట్లు ఖర్చు కానున్నాయి. దీనికి త్వరలోనే సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టనున్నారు. రైస్‌మిల్లులకు అనుసంధానంగా గోదాములు, రైస్‌బ్రాన్ ఆయిల్ ఉత్పత్తి చేసే మిల్లులను కూడా ఏర్పాటు చేయనున్నారు. సీఎం అధ్యక్షతన జరిగిన సమీక్షలో.. సివిల్ సప్లై కార్పొరేషన్ ఆధ్వర్యంలో రైస్‌మిల్లుల ఏర్పాటు, నిర్వహణ, మార్కెట్ విస్తరణ వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రైతులకు మేలు జరిగేలా మరిన్ని నిర్దిష్ట ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సంబంధిత అధికారులను సీఎం ఆదేశించారు. పౌరసరఫరాల కార్పొరేషన్‌లో సిబ్బందిని పెంచుకోవాలని సూచించారు. సమీక్షలో మంత్రి గంగుల కమలాకర్, రైతుబంధు సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పౌరసరఫరాల సంస్థ చైర్మన్ రవీందర్‌సింగ్, సీఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూలో ప్రమోషన్ల ప్రక్రియ పూర్తి చేయండి

- **సీఎస్‌కు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశం**

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): రెవెన్యూ శాఖలో ప్రమోషన్ల ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు. తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా ప్రమోషన్లు ఇవ్వడం సహా అన్ని క్యాడర్ల ప్రమోషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (టీఆర్ఈఎస్ఏ) అధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి , ప్రధాన కార్యదర్శి గౌతంకుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ మన్నె ప్రభాకర్ సోమవారం సచివాలయంలో సీఎం కేసీఆర్‌ని కలిసి తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా ప్రమోషన్లు ఇవ్వడంతో పాటు అన్ని క్యాడర్ల వారికి ప్రమోషన్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన సీఎం కేసీఆర్ అసోసియేషన్ ప్రతినిధులతో వెంటనే చర్చించి ప్రమోషన్ల ప్రక్రియకు అవసరమైన విధివిధానాలు రూపొందించాలని సీఎస్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో టీఆర్ఈఎస్ఏ ఉపాధ్యక్షుడు పాక రమేశ్, కార్యదర్శులు నజీమ్‌ఖాన్, సైదులు, హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాల అధ్యక్షులు రామకృష్ణ, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. తమ విజ్ఞప్తిని మన్నించి పదోన్నతులపై అప్పటికప్పుడే సీఎం కేసీఆర్‌కు ఆదేశాలు జారీ చేయడం పట్ల ట్రెసా నేతలు హర్షం వ్యక్తం చేశారు.

తకరారు బాబు.. ఎకరాల ఏడుపు

మూడోపేజీ తరువాయి...

చివరిదాక వల్లెవేసిన ఉదంతాన్ని తెలంగాణ సమాజం ఎప్పటికీ మరిచిపోలేదు. తెలంగాణ ఏర్పాటును చివరి నిమిషం దాకా అడ్డుకున్న చంద్రబాబు స్వరం అనూహ్యంగా ఎందుకు మారింది? అవకాశం చిక్కినప్పుడల్లా తెలంగాణపై విషం చిమ్మే చంద్రబాబు ఇప్పుడు అనివార్యంగా ఇక్కడి అభివృద్ధిని ఎందుకు కొనియాడుతున్నారు? బాబు మాటల్లోని మర్మమేమిటి? తెలంగాణలో ఒక ఎకరం అమ్మితే ఏపీలో యాభై, వందెకరాలు కొనుక్కోవచ్చునంటూ టీడీపీ అధినేత చెప్పిన మాట ముమ్మాటికీ నిజం. అయితే ఆయన తెలంగాణను మనస్ఫూర్తిగా పొగుడుతున్నడా ? లేక తెలంగాణ అభివృద్ధి మీదికి ఇతరులను రెచ్చగొడుతున్నడా ? ఒకవేళ రెచ్చగొట్టడమే అయితే.. ఎవరిని ఎవరి మీదికి ప్రయోగించాలని చంద్రబాబు చూస్తున్నారు?

రెచ్చగొట్టడమే అంతరార్థమా?

ప్రాథమికంగా బాబు వ్యాఖ్యలోనే ఒక ఆధిపత్య అభిజాత్యం లీలగా కనిపిస్తున్నది. 'ఒకప్పుడు మనం కొనేవాళ్లం.. ఇప్పుడు కొనలేకపోతున్నాం' అన్న అర్థంతోపాటు ఆయన పాలన సాగించిన సమయంలోనూ, ఇప్పుడూ రెండు సందర్భాల్లో చంద్రబాబు ఏపీ వైపే నిలబడి మాట్లాడుతున్నట్టు అర్థమవుతున్నది. 'వేరే ప్రాంతాలవాళ్లు తెలంగాణకు వచ్చి భూములు కొనొచ్చు. తెలంగాణ వాళ్లు ఇతర ప్రాంతాలకు పోయి భూములు కొనడమేమిటి?' అన్న చిన్నచూపే ఆయన వ్యాఖ్యల్లో ద్యోతకమవుతున్నది. తెలంగాణ వాళ్లు ఏపీలోనో, ఇతర రాష్ట్రాల్లోనో భూములు కొనుక్కోవద్దా? తెలంగాణ రైతు సంపన్నుడు కావొద్దా?

మాటల్లో మంటలు!

చంద్రబాబు తాజా వ్యాఖ్యల వెనుక నేపథ్యాన్ని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. 'ఇటీవలికాలంలో ఆయన బీజేపీతో అంటకాగుతుండటం చూస్తున్నాం. ప్రధాని మోదీని కలవడానికి చంద్రబాబు వెంపర్లాడటం, బీజేపీతో చేతులు కలపడానికి తహతహలాడటం ఇటీవలి పలు సందర్భాల్లో గమనిస్తున్నాం. ఇది నాణేనికి ఒకవైపు. మరోవైపు తన తాబేదార్లను వేరే పార్టీల్లోకి పంపి పరోక్షంగా చక్రం తిప్పాలని కొన్నేండ్లుగా ఆయన ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో బాబు వ్యాఖ్యలు పైకి చూస్తే ప్రత్యర్థిని మెచ్చుకున్నట్టు కనపడుతుంది. కానీ దాని వెనుక లోతైన అర్థాలున్నాయి' అని విశ్లేషకుడు ఒకరు చెప్పారు. మరోవైపు కేసీఆర్ సారథ్యంలోని భారత రాష్ట్ర సమితి ఇటీవల ఏపీలోకి ప్రవేశించాలని ప్రయత్నిస్తున్నది. అక్కడ కార్యాలయాన్ని కూడా ప్రారంభించింది. బీఆర్ఎస్ తమ ప్రాంతానికి రావాలని ఏపీ ప్రజలనుంచి వినతులు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. తెలంగాణలాగే ఏపీనీ అభివృద్ధి చేయాలని అక్కడి మేధావులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్